క్లుప్తంగా

'సోషల్' యాక్టివిస్టులపై కొనసాగుతున్న వేధింపులు



యడ్లపాడు: వైఎస్సార్‌ సీపీ సోషల్‌ మీడియా యాక్టివిస్టులపై వేధింపులు ఎంతకూ ఆగడం లేదు. ఇటీవల చిలకలూరిపేటకు చెందిన సుధారాణిని అరెస్టు చేసిన ఉదంతం మరువక ముందే యడ్లపాడు మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ సోషల్‌ మీడియా కో-కన్వీనర్‌ బిరుదు అనంతబాబును సోమ,మంగళవారాలు పోలీసులు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు.

సోషల్‌ మీడియాపై కేసులు అన్యాయం

ఖండించిన ఎం.ఐ.ఎం పార్టీ నేత షేక్‌ మౌలాలి



నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం సోషల్‌ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారనే నేపంతో అక్రమ కేసులు బనాయించటాన్ని ఎంఐఎం పార్టీ ఖండిస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్‌ మౌలాలీ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అది రాజ్యాంగం కల్పించిన హక్కని మౌలాలి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉందని ఇచ్చిన తీర్పునీ మౌలాలి గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రశ్నించే హక్కు పార్టీలకు, ప్రజాసంఘాలకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు ప్రశ్నించ కూడదని, ప్రశ్నిస్తే కేసులు పెడతాం అన్న రీతిలో ఒక భయాన్ని కలిగించే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం తన పద్ధతి మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

యూటీఎఫ్‌ నూజెండ్ల మండల శాఖ నూతన కమిటీ ఎంపిక



ప్రకాశరావు



మల్లికార్జునరావు

వినుకొండ(నూజెండ్ల): యూటీఎఫ్‌ నూజెండ్ల మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఎ.సోమసూర్యప్రకాశరావు, ప్రధానకార్యదర్శిగా సీహెచ్‌.మల్లికార్జునరావు, గౌరవాధ్యక్షునిగా డి.కోటేశ్వరరావులను ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, మహిళా సహాధ్యక్షులుగా ఎ.జ్యోతి, కోశాధికారిగా వై.శ్రీనివాస రావులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

ఈపూరు యూటీఎఫ్‌ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



ఈపూరు: యూటీఎఫ్‌ ఈపూరు మండల నూ తన కార్యవర్గ ఎన్నిక వినుకొండలోని యూటీఎఫ్‌ కార్యాలయంలో నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల్లో జరిగింది. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా కె.శ్రీనివాస మూర్తి, అధ్యక్షులు గా వి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.జ్యోతిష్‌, సహాధ్యక్షులుగా వై.రాజ్‌కుమార్‌, జి.సునంద, కోశాధికారిగా వై.ఐ.ఖాశీం సైదులును ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఎ.రవికుమార్‌ వ్యవహరించారు. నూతన కమిటీని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

రేపటి నుంచి సహకార వారోత్సవాలు

- వికసిత భారత్‌ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర మార్పులు, నూతన చట్టాలపై కార్యక్రమాలు
- సహకార ఉద్యమం బలోపేతమే లక్ష్యంగా ఉత్సవాల నిర్వహణ



ఏడు రంగుల సహకార జెండా

రొంపిచర్ల: అఖిల భారత 71వ సహకార వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు సహకార శాఖ సిద్ధమైంది. ఈ వారోత్సవాలు పండిట్‌ జవహర్‌లాల్‌ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారు. సహకార రంగం అభివృద్ధిని, సంఘాల విజయగాథలను తెలియపరిచే లక్ష్యంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తారు. గడచిన సంవత్సరంలో సంఘాల్లో జరిగిన అభివృద్ధిని సమీక్షించుకుంటూ భవిష్యత్‌కు కావలసిన ప్రణాళికలు తయారు చేసుకొని అమలు పరుస్తారు. సహకార వ్యవస్థలో వచ్చిన మార్పులు, నూతన చట్టాలను ఈ వారోత్సవాల్లో తెలియజేస్తూ ప్రజల్లో సహకార ఉద్యమం పట్ల నమ్మకాన్ని కలిగిస్తూ ఆసక్తిని కలుగజేయటమే సహకార వారోత్సవాల ముఖ్య ఉద్దేశం. సహకార జెండాలో ఇంద్ర ధనస్సులో ఉన్న ఏడు రంగులు ఉంటాయి. ఒక్కొక్క రంగు ఒక్కొక్క ఆశయాన్ని సూచిస్తుంది. ఈ జెండాలో ఉండే ఎరుపు రంగు పట్టుదల, అంకిత భావం తెలియజేస్తుంది. నారింజ రంగు సభ్యుల మధ్య స్నేహం, పసుపు రంగు శాంతిని, పచ్చ రంగు ఆర్థిక స్థోమతకు, నీలం రంగు ఆత్మశుద్ధికి, ఇండిగో రంగు సభ్యుల మధ్య సమానత్వం, ఊదా రంగు సభ్యులందరిలో నీతిని తెలియజేస్తుంది. ఈ జెండాలో ఎరుపు రంగు పై భాగాన ఉండేలా రూపొందించారు. వికసిత భారత్‌ నిర్మాణంలో సహకార రంగాల పాత్ర ప్రధాన అంశంగా కార్యక్రమాలను వారం రోజుల పాటు రూపొందించారు. వారోత్సవాల ప్రారంభం రోజు 14వ తేదీన సహకార మంత్రిత్వ శాఖ కొత్త కార్యక్రమాల ద్వారా సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయుటంపై చర్చిస్తారు. 15వ తేదీన సహకార రంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, మూడవ రోజున 16న వ్యవస్థాపక ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి ప్రోత్సహించటంలో సహకార రంగాల పాత్ర అనే అంశాలపై కార్యక్రమాలు ఉంటాయి. అలాగే 17న సహకార సంస్థలను వ్యాపారాభివృద్ధి సంస్థలుగా మార్చటం, 18న సహకార సంఘాల మధ్య సహకారం పెంపొందించటం, 19న మహిళ, యువత మరియు బలహీన వర్గాల కొరకు సహకార సంఘాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యం సాధనలో మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర అనే అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. పల్నాడు జిల్లాలో 14వ తేదీన నరసరావుపేటలోని డివిజినల్‌ కోఆపరేటివ్‌ కార్యాలయంలో వారోత్సవాలు ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం శావల్యాపురం పీఏసీఎస్‌లో 15న ఉదయం ఈపూరు పీఏసీఎస్‌లో, సాయంత్రం దూళిపాళ ఏబీఎఫ్‌ఎస్‌సీఎస్‌లో 16న నరుకుళ్లపాడు, ఇక్కుర్రు పీఏసీఎస్‌లో, 17న బీఎస్‌ఎన్‌ఎల్‌ ఎంప్లాయిస్‌ కోఆపరేటివ్‌ క్రెడిట్‌ సొసైటీ చిలకలూరిపేటలో, 18న పాల్వాయి, మాచవరం పీఏసీఎస్‌లో 19న దాచేపల్లి పీఏసీఎస్‌, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఎస్సీ ఎస్టీ ఎల్‌సీ సీఎస్‌ నడికూడి, కారుమంచి పీఏసీఎస్‌, దికారుమంచి శ్రీనివాస మహిళా కోఆపరేటివ్‌ కంజూమర్స్‌ స్టోర్‌లో, 20వ తేదీన యడ్లపాడు పీఏసీఎస్‌లో వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు.

ప్రణాళికలు సిద్ధం చేశాం



భారత జాతీయ సహకార యూనియన్‌ న్యూఢిల్లీ వారి మార్గదర్శకాల మేరకు జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో వారోత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి సంఘంలో వారంలో ఒక రోజు ప్రత్యేక అంశంపై చర్చలు, సమావేశాలు, ప్రజల్లోకి సహకార ఉద్యమాన్ని తీసుకు వెళ్లే కార్యక్రమాలు చేపడుతున్నాం. 14వ తేదీన అన్ని సహకార సంఘాలు సంస్థల్లో సహకార పతాక ఆవిష్కరణతో వారోత్సవాలు ప్రారంభమవుతాయి.

– ఎం. వెంకటరమణ, జిల్లా సహకార శాఖ అధికారి

ఉపాధి పనులు ఉపయుక్తంగా ఉండాలి

ఎంపీడీవో సీతారామయ్య



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ఉపాధి హామీ పథకంలో ప్రజలకు అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మండలంలోని బొందిలిపాలెం, చినకంచర్ల, మతుకుమల్లి గ్రామపంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గతంలో గుర్తించిన పనులకు పంచాయతీ తీర్మానంతో పాటు ఆమోద గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలన్నారు. అలాగే జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పించే బాధ్యత ఆయా గ్రామాల్లోని ఫీల్డ్‌ అసిస్టెంట్లపై ఉందన్నారు. బొందిలిపాలెం గ్రామంలో రూ. 75 లక్షల నిధులకు సంబంధించి 96 రకాల పనులకు ఆమోదించారు. చినకంచర్ల గ్రామంలో రూ.44 లక్షలకు గాను 52 రకాలు పనులు, మతుకుమల్లి గ్రామ పంచాయతీలో రూ. ఒక కోటి 6 లక్షల 85 వేల రూపాయాల నిధులకు గాను 106 రకాల పనులు పంటకాల్వలు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, పొలాలకు వెళ్లే గ్రావెల్‌ రోడ్లు, మొక్కలు నాటే పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ గ్రామసభలో సర్పంచులు చింతా విజయ్‌కుమార్‌, పురేటి నాగేశ్వరరావు, యలగాల బసవయ్య, ఏపీవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, బాల పరమేశ్వరరావు, శ్రీవల్లీ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులు ఉపేక్షించం

- ఎమ్మార్పీ కంటే అధికంగా మద్యం విక్రయిస్తే రూ.5 లక్షల జరిమానా
- నాటుసారా తయారు చేస్తే పీడీ యాక్ట్‌
- తెలంగాణ మద్యం కట్టడికి చర్యలు
- విలేకర్ల సమావేశంలో ఎక్సైజ్‌ డీసీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాసరావు

నరసరావుపేటటౌన్‌: బెల్టు షాపులను ఏట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎక్సైజ్‌ ఈఎస్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన మద్యం అమలు విధానంలో ఖచ్చితంగా నిబంధనలు పాటిస్తామన్నారు. పల్నాడు జిల్లాలో మాచర్ల, నరసరావుపేట మండలం పమిడిపాడు, నకరికల్లు మండలం చేజర్ల, బొల్లాపల్లి తండా ప్రాంతాల్లో నాటు సారా తయారీ ఉందన్నారు. నాటుసారా రహిత పల్నాడు జిల్లాగా మార్చటమే ధ్యేయంగా అధికారులు పని చేయాలన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్‌ పెడతామని తెలిపారు. బెల్టు షాపులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. మద్యం ఎంఆర్పీకి మాత్రమే అమ్మాలలి, అధిక ధరలకు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కొందరు లిక్కర్‌ తెచ్చి అమ్ముతున్నారన్నారు. మద్యం షాపులలో ధరలను సిబ్బంది ఎప్పటికప్పుడు డెకాయ్‌ ఆపరేషన్‌ ద్వారా పరిశీలిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఒక్క మద్యం బాటిల్‌ మన రాష్ట్రానికి తెచ్చినా కేసు నమోదు చేస్తామన్నారు. బోర్డర్‌ చెక్‌ పోస్టుల ద్వారా ఇతర రాష్ట్రాల మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడినా, మద్యం అధిక ధరలకు విక్రయించినా రూ.5 లక్షల జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌ మణికంఠ, ఏఎస్‌ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జీపీడీపీపై శిక్షణ కార్యక్రమం

శావల్యాపురం: నేడు స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గ్రామపంచాయతీ అభివృద్ధి (జీపీడీపీ) మండల అభివృద్ధి ప్రణాళికలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి సారథ్యంలో జరుగుతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆధార్‌ నకలు, ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌ఫోన్‌ నంబరును మండల పరిషత్‌ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం

ఎక్సైజ్‌ సీఐ శ్రీనివాసరావు

శావల్యాపురం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని వినుకొండ ఎక్సైజ్‌ సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో అక్రమంగా మద్యం సీసాలు (వీఎస్‌టీపీ) అమ్మకం చేస్తున్న వయ్యకంటి వెంకట్రావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించటం చట్టరీత్యానేరమన్నారు. వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం మండలాల పరిధిలో ఇప్పటి వరకు ఆక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్న వారిపై 10 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే మద్యం దుకాణాదారులు ఎంఆర్పీ ధరలకే సీసాలను అమ్మాలని, ఫిర్యాదులకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. గ్రామాల్లో పోలీసు నిఘా ఉంచామని, బెల్టుషాపుల నిర్వహిస్తే అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్‌: గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్‌ ఎస్‌ఐ కిశోర్‌ తెలిపాడు. నందిగామకు చెందిన కంచర్ల శివరామకృష్ణ (40), ప్రసన్న దంపతులు కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని టిడ్కో గృహాలలో నివాసం ఉంటున్నాడు. శివరామకృష్ణ గత కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈ నేపథ్యంలో ప్రసన్న ఒత్తిడి మేరకు శివరామకృష్ణ అయ్యప్ప స్వామి మాల ధరించాడు. అయితే మద్యం లేకుండా ఉండ లేకుండా పోతున్నానని, మాలను తీసివేస్తానని చెప్పడంతో సోమవారం రాత్రి భార్యభర్తల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం శివరామకృష్ణ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. స్థానికులు గమనించి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతిచెందాడు.

ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఆదాయం



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్‌: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు ఎరువులు, కషాయాలు సొంతగా తయారు చేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గి ఆదాయం లభిస్తుందని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని అంజిరెడ్డి సమావేశ మందిరం మంగళవారం మాచర్ల డివిజన్‌ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమలకుమారి, రాష్ట్ర రీసోర్స్‌ పర్సన్‌లు రామచంద్రన్‌, ఉషలు పాల్గొన్నారు. ఈసందర్భంగా అమల కుమారి మాట్లాడుతూ రైతులు తమ పంటలకు అవసరమైన ఎరువులైన బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతంలు తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని తెలిపారు. దీని వలన రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు పూర్తిగా తగ్గించుకోవచ్చని తెలిపారు. దీంతో పాటు పంటపై పిచికారీ కోసం కోడిగుడ్డు, నిమ్మరసం, చేప బెల్ల ద్రావణం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అజ్ఞాస్త్రం, పుల్లటి మజ్జిగను రైతులు తయారు చేసుకోవచ్చని తెలిపారు. రసాయన వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు పంట పెట్టుబడిలో పిచికారీ కోసం 30 శాతం ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సొంతగా ఎరువులను తయారు చేసుకోవడం వల్ల నికర ఆదాయం పెరుగుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీపీఎం ప్రేమ్‌రాజ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని సరిచేసే బాధ్యత ప్రభుత్వానిదే

యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్‌



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్‌

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, సంస్కరణల పేరిట గత ప్రభుత్వాలు అమలుపరిచిన అస్తవ్యస్త విధానాలను సరిచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకోవాలని యూటీఎఫ్‌ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్‌ అన్నారు. స్థానిక యూటీఎఫ్‌ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు అధ్యక్షతన జరిగిన ఈపూరు, నూజెండ్ల యూటీఎఫ్‌ మండల శాఖల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్‌ స్వర్ణోత్సవ సభలు జరుపుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్‌ అనేక పోరాటాలు చేసిందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మెరుగైన జీతాలు సాధించి సమాజంలో గౌరవాన్ని నిలబెట్టేలా కృషి చేసిందన్నారు. 117వ జీవోను రద్దు చేయాలని, అపార్‌ పని సరళీకరణ చేసి గడువు పెంచాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌ నాయకులు అజయ్‌, పోలయ్య, జిలానీ, రామిరెడ్డి, మల్లికార్జున, నాగేశ్వరరావు, వీరాంజనేయులు, మస్తాన్‌, గోవింద్‌నాయక్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్‌ మెటీరియల్‌ పంపిణీ



మెటీరియల్‌ అందుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వై. మల్లిఖార్జునరావు తయారు చేసిన నేషనల్‌ మీన్స్‌ కం మెరిట్‌ స్కాలర్‌షిప్‌కు ప్రిపేర్‌ అయ్యే విద్యార్థులకు పరీక్షా మెటీ రియల్‌ను మంగళవారం మండల విద్యాశాఖ అధికారి పరమేశ్వరరావు ఆవిష్కరించారు. ఎన్‌ఎంఎంఎస్‌ మెటీరియల్‌ను మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి బ్రహ్మేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్షకు హాజరవుతున్న రొంపిచర్ల, సంతగుడిపాడు, వి.రెడ్డిపాలెం, కొత్తపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఈ మెటీరియల్‌ ను అందించారు. ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్షకు అవసరమైన మెటీరియల్‌ను తయారు చేసి ఉచితంగా విద్యార్థులకు అందించిన ఉపాధ్యాయుడు మల్లిఖార్జునరావును పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. మెటీరియల్‌ పంపిణీ ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఎం. సుభాని, శ్రీనివాసరావు, ఆంజనేయులు, మాధవిలతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్పీ కాలువను పునరుద్ధరించండి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: మండలంలోని ములకలూరు–గోళ్లపాడు గ్రామాల మధ్యలో ఓ టౌన్‌షిప్‌ ఏర్పాటుచేసిన వెంచర్‌లో ఎన్‌ఎస్పీ కాలువ, ఆర్‌అండ్‌బీ రోడ్లను కలుపుకొని గార్డెన్‌ నిర్మాణం చేశారని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌ఎస్పీ కార్యాలయంలో సూపరిండెంట్‌ కరిముల్లాకు వినతిపత్రం సమర్పించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలలను ఉపయోగించుకొని ప్లాట్లు అమ్మకాలు భారీగా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ కాలువలు, పంట కాలువలు, వాగులు, వివిధ రకాల భూములు ఆక్రమించి తమ వెంచర్లో కలుపుకుంటున్నారని, దీనిని అందంగా ముస్తాబు చేసి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దీనిపై సూపరిండెంట్‌ ఇంజనీరు తగిన చర్యలు తీసుకొని కాలువలను పునరుద్ధరించాలని కోరారు. పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైతాంగానికి జరిగింది అన్యాయమే

రైతుసంఘం నాయకులు మోహన్‌చందు

శావల్యాపురం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌ వలన రైతాంగానికి ఎలాంటి లబ్ధి చేకూరలేదని సీపీఎం మండల కార్యదర్శి రైతు సంఘం నాయకులు కె.వి.ఆర్‌.మోహన్‌చందు అన్నారు. మంగళవారం శావల్యాపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్‌ సీజను పూర్తి అయిందని రబీ సీజను ప్రారంభమైన నేటి వరకు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. పంటల బీమా స్వచ్ఛంద నమోదు అని చెప్పటం మినహా ఇప్పుటి వరకు ఉన్న ఉచిత బీమా ఇకపై రైతు ప్రీమియం చెల్లిస్తేనే అనే విషయాన్ని దాచిపెట్టటం అన్నదాతలను మోసం చేయటమేనన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్‌ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే చార్జీల మోతతో వినియోగదారులపై ఆదనపు భారం మోపటం దారుణమన్నారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన కొన్ని కాంప్లెక్స్‌ ఎరువులు కొరత వలన తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కనీసం రబీ సీజనులో ఎరువుల కొరత లేకుండా రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

వల్లభేశ్వరునికి ఏకాదశి సేవ

రొంపిచర్ల: కార్తిక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని అన్ని ఆలయాల లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఆలయాల్లోని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు అందజేసిన ప్రత్యేక ప్రసాదాలను పంపిణీ చేశారు. ఏకాదశి విశిష్టతను ఆయా దేవాలయాల ప్రధానార్చకులు భక్తులకు వివరించారు. అలాగే వి.రెడ్డిపాలెంలోని పట్టభిరామస్వామి ఆలయంలో హరేరామ హరే కృష్ణ నామ స్మరణ ఏకాహ భజనా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభించారు. కంకణధారులైన భక్తులు హరేరామ నామ స్మరణతో భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు నరసింహమూర్తి ఆచార్యులు తెలిపారు.

పంచాయతీ ఆర్థిక ప్రణాళిక తయారీపై శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): పంచాయతీల ఆర్థిక ప్రణాళిక తయారీపై నూజెండ్ల మండల పరిషత్‌ కార్యాలయంలో మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు తయారీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు, ఉన్నతాధికారులు గ్రామాలకు అవసరమైన ప్రజా మౌలిక వసతులపై సమగ్ర పరిశీలన చేసి నిధులు అవసరం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో అధికారులు సమీక్ష జరిపి సమగ్ర నివేదికను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీలు పాల్గొన్నారు.

ఐదేళ్ల లోపు పిల్లల్లో నిమోనియా ప్రమాదకరం

- వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఫిబ్రవరి 28వ వరకు శాన్స్‌ సర్వే
- డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవి



శాన్స్‌ సర్వేపై మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవి

నరసరావుపేట: నిమోనియా వ్యాధిగ్రస్తులను గుర్తించి ఐదేళ్ల లోపు పిల్లల్లో మరణాలను తగ్గించటమే శాన్స్‌ సర్వే ముఖ్య ఉద్దేశమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ బి.రవి పేర్కొన్నారు. మంగళవారం ఏరియా హాస్పిటల్‌లోని ప్రసూతి వార్డులో జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి డాక్టర్‌ బి.గీతాంజలి, ఏరియా హాస్పిటల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎం.మంత్రునాయక్‌, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలెన్స్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మౌనికలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మంగళవారం నుంచి జిల్లాలోని అన్ని గ్రామాలలో శాన్స్‌(ఎస్‌ఎస్‌ఏఎన్‌ఎస్‌) సర్వే ఇంటింటి జరుగుతుందన్నారు. ఈ సర్వే ఫిబ్రవరి 28వ వరకు నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం పల్నాడు జిల్లాలోని ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్స్‌లకు వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించి కోల్డ్‌చైన్‌, వ్యాక్సిన్‌ మేనేజెమెంట్‌లపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఆరుగురు పేకాటరాయళ్లు అరెస్ట్‌

నరసరావుపేట రూరల్‌: పాలపాడులో పేకాట శిబిరంపై రూరల్‌ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్‌ చేశారు. గ్రామంలోని చెరువు కట్టపై పేకాట నిర్వాహిస్తున్నారన్న సమాచారంతో రూరల్‌ ఎస్‌ఐ కిశోర్‌ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఆరుగురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.15,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేడు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో నేడు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

పరవాలేదు.. బాగుంది!



పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలికోన్నత పాఠశాలను పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జిఫ్రుల్లా, హెచ్‌ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

వచ్చారు.. వెళ్లారు!



నూజెండ్ల మండలంలోని కొత్త జడ్డావారిపాలెం చౌకదుకాణం 0744017లో కంది పప్పు బ్లాక్‌ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. అయితే గ్రామస్తులు ఫిర్యాదు చేసినా కూడా స్పందించకుండా సీఎస్‌డీటీ, ఎండీఎం ఆపరేటర్‌తో సంప్రదింపులు చేసుకొని గ్రామస్తులను విచారించకుండా వెనుతిరిగి వెళ్లడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో విచారించి గ్రామస్తులకు నిత్యావసర సరుకులు సకాలంలో అందరికీ అందేటట్లు చూడాలని కోరుతున్నారు.

–వినుకొండ(నూజెండ్ల)